క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లోని కాశీం గుట్టపై నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఇంజాపూర్‌కు చెందిన గుర్రం చంద్రశేఖర్ రెడ్డి భారీ విరాళాన్ని అందజేశారు. మంగళవారం అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసి ఆలయ కమిటీ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మేతరి స్వామి, చెక్క మల్లయ్య, అశోక్, బాలనర్సింహ, సుధాకర్, బాబు, దయానంద్‌లు ఆయనను శాలువతో సత్కరించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

తుర్కయంజాల్: ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అనేది ఒక మధురానుభూతి అని బచ్‌పన్, అకాడమిక్ హైట్స్ స్కూల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రీజనల్ డైరెక్టర్ కె.రూపారెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి వారికి సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ జ్యోతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టు



పోలీస్ స్టేషన్ ఎదుట నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులను మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఆదిబట్ల మున్సిపాలిటీ నాయకులు కోరే జంగయ్య, యువజన విభాగం అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి, నేతలు శ్రీకాంత్, వెంకటేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తుతో విడుదల చేశారు.

బడిలో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎంఈఓ చాంప్లానాయక్

ఆమనగల్లు: తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ఎంఈఓ చాంప్లానాయక్ ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయురాలు నసిమా సుల్తానా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అంజయ్య, శ్యాంసుందర్‌రావు, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసమూర్తి, అంబాజీ, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు ముజుబుర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



రైతు హనుమయ్యకు డెయిరీ రుణాన్ని అందజేస్తున్న చైర్మన్ అశోక్

నందిగామ: పీఏసీఎస్‌ల ద్వారా ఇచ్చే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చేగూరు పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో పీఏసీఎస్ నుంచి మంగళవారం అశోక్ చేతుల మీదుగా రైతులకు పలు రకాలైన రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన రైతులకు అన్ని రకాలైన రుణాలు అందజేస్తామన్నారు. మోత్కులగూడ గ్రామానికి చెందిన రైతు జెట్ట హనుమయ్యకు డెయిరీ రుణం రూ.30లక్షలు అందజేసినట్లు తెలిపారు.

సుందరీకరణ.. ఏదీ ఆచరణ?

- మురుగునీటితో కూరుకుపోయిన ఉప్పరాశికుంట
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- శంకుస్థాపనకే పరిమితమైన సుందరీకరణ పనులు



మురికినీటితో ఉప్పరాశికుంట చెరువు

కడ్తాల్: చెరువు సుందరీకరణకు కట్టుబడి ఉన్నామన్న నాయకుల మాటలు నీటి మీది రాతలుగా మారాయి. ఉప్పరాశి కుంటకు మెరుగులు దిద్దడానికి శంకుస్థాపన చేసి ఏడాదిన్నర గడిచినా నేటికి పనులు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు, పర్యావరణ ప్రేమికులు విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన 14.25 ఎకరాల ఎఫ్‌టీఎల్ పరిధిలో విస్తరించి ఉన్న ఉప్పరాశికుంట మురికినీటితో కూరుకుపోయింది. స్థానికంగా వర్షాలు కురిసినప్పుడు నీరంతా ఉప్పరాశి కుంటలోకి చేరుతుంది. అందుకు ఏడేళ్ల క్రితమే అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించారు. ఆ సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉండే కాలనీవాసులు తమ ఇంటి వ్యర్థాలను నేరుగా డ్రైనేజీలోనే కలిపారు. దీంతో ఉప్పరాశికుంటలో మురుగు జలాలు చేరి దుర్గంధభరితమైంది. ఫలితంగా చెరువులోని జలచరాలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముక్కుపుటాలు అదురుతున్నాయి

ఉప్పరాశి కుంటను సుందరీకరణ చేపట్టాలని స్థానికుల డిమాండ్ మేరకు గత అసెంబ్లీ ఎన్నికల ముందు రూ.20 లక్షల అంచనా వ్యయంతో నీటి పారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. నేటికి పనులు చేపట్టకపోవడం గమనార్హం. స్థానిక జనావాసాల మురుగు, చికెన్ మటన్ వ్యర్థాలు, మూగ జీవాల కళేబరాలు, గ్రామంలో చెత్తను గుట్టు చప్పుడు కాకుండా చెరువులోనే వేస్తున్నారు. దీంతో స్థానిక కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమీపంలోనే బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సైతం కంపు వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప్పరాశి కుంట సమీపాన ఉన్న రహదారి మీదుగా నిత్యం అన్మాస్‌పల్లి, శాయిరెడ్డిగూడెం, పిరమిడ్ ధ్యాన కేంద్రానికి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కుంట పరిసరాలు చెత్త వ్యర్థాలకు నిలయంగా మారడంతో దుర్వాసనతో ముక్కుపుటలు అదురుతున్నాయి. మరోవైపు ఉప్పరాశి కుంట క్రమక్రమంగా ఆక్రమణనకు గురవుతుంది. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



కుంటలోకి చేరుతున్న వ్యర్థ జలాలు

పలుమార్లు వినతులు



ఉప్పరాశి కుంటను రక్షించి, సుందరీకరణ చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చినా పరిష్కారానికి నోచుకోలేదు. దీనిపై అధికారులు నిర్లక్ష్యం చూపడం తగదు. కలుషిత నీరు ఉప్పరాశికుంటలోకి చేరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి.

– రాజేందర్‌గౌడ్, యువజన నాయకుడు, కడ్తాల్

పనులు చేపట్టాలి



చెరువును అభివృద్ధి పరిచేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. ఆక్రమణకు గురైన ఉప్పరాశికుంట భూమిని కాపాడాలి. సమీపంలోని ప్రజలకు పార్కుతో పాటు, కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి, సుందరీకరణ పనులు వెంటనే చేపట్టాలి.

– దాసు, అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షుడు, కడ్తాల్

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

కడ్తాల్: విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివితే అద్భుత విజయాలు సాధిస్తారని సీఐ శివప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశంతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దీనికి సీఐ శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థి జీవితంలో పాఠశాల విద్యలో పదో తరగతి చివరిదని, దీనిని మధుర జ్ఞాపకంగా మలుచుకోవాలని సూచించారు. పరీక్షలంటే భయం వీడాలని, ఒత్తిడికి గురికావద్దని, పట్టుదలతో చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జంగయ్య, పాఠశాల చైర్మన్ విజయ, ఉపాధ్యాయులు రాధాకృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేష్, ఇంద్రారెడ్డి, భీముడు, శ్వేత, భాగ్యలక్ష్మి, శోభరాణి, సునీత, గీతాబాయి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్

మొయినాబాద్‌రూరల్: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఎవరూ కూడా చట్టానికి చుట్టం కాదని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్‌లు ధరించని వారిని, వాహనాల పత్రాలు, లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు. అదే విధంగా ట్రాఫిక్ చలాన్‌లు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాదారులు పోలీసులకు సహకరిస్తూ ప్రభు త్వ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్‌ఆర్‌ఎస్)కు 2020లో దరఖాస్తు చేసుకున్న వారికి ఫీజులో 25 శాతం సబ్సిడీని అందిస్తోందని, అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రవిచంద్ర కుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సంగెం గ్రామంలో గతంలో ప్లాట్లను కొనుగోలు చేసినవారు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ద్వారా వివరాలను తెలుసుకొని దరఖాస్తు ఫీజును చెల్లించేందుకు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. దరఖాస్తుదారులు సిటిజన్ లాగిన్ ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులను జనరేట్ చేసుకోవాలని, అనంతరం ఫీజును చెల్లించాలన్నారు. మండలంలో 918 మంది దరఖాస్తుదారులు ఫీజులను ఇప్పటివరకు చెల్లించారని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై సమాచారం కోసం మండలంలో 8125209849 హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



హోమం చేస్తున్న భక్తులు

కొందుర్గు: మండలంలోని గంగన్నగూడ గ్రామంలో గల అభయాంజనేయస్వామి దేవాలయ మొదటి వార్షికోత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, చందనాలంకరణ కార్యక్రమం జరిపించారు. అదేవిధంగా హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

రాజీవ్ యువ వికాసంతో ఉపాధి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లోని నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకంతో నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 5 లక్షల మంది నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందేందుకు వీలుంటుందన్నారు. సుమారు రూ.6 వేల కోట్లు కేటాయించారన్నారు. ఒక్కో లబ్ధిదారుడికి రూ.4 లక్షల వరకు రాయితీతో రుణం మంజూరు చేయనుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 57 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు హన్మానాయక్, వెంకటేష్, జహంగీర్‌అలీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

మాడ్గుల: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించారని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ బాబా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాస పథకంతో నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు పట్టాలు ఇవ్వాలని వినతి

ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా



ఆర్డీఓ అనంతరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని అనాజ్‌పూర్ రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య డిమాండ్ చేశారు. గ్రామంలోని 274 నుంచి 278 వరకు, 281 సర్వే నంబర్లలోని 125 మంది రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వాలని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. నాటి ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలకు పట్టా పాసు పుస్తకాలు ఇచ్చిందన్నారు. కానీ తెలంగాణ వచ్చిన అనంతరం కొత్త పాసు పుస్తకాలు ఇవ్వకుండా వాటిని లాక్కొని బడాబాబులకు కట్టబెట్టాలని ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. అనాజ్‌పూర్ రైతులకు న్యాయం చేయాలని ఆర్డీఓ అనంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముత్యాలు, జంగయ్య, లింగస్వామి, భిక్షపతిగౌడ్, రంగయ్య, రవికుమార్, మహేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలలపై పక్షపాత వైఖరి వీడాలి

చేవెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలల పట్ల పక్షపాత వైఖరిని వీడాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. చేవెళ్లలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఎస్సీల కులగణన 2025 జనాభా లెక్కల ప్రకారం కాకుండా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణతో ఎస్సీలలోని ఒక బలమైన విభజన రేఖ ఏర్పడుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయటంతో ఎస్సీ కులాల్లోని ఆయా కులాల పట్ల తీవ్ర ద్వేషం, అనైక్యత పెంపొందుతుందన్నారు. వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మాలలను మనువాదులుగా, ద్రోహులుగా చిత్రీకరించి సమాజం ముందు దోషులుగా నిలబెట్టాలనే కుట్రలను మాల సమాజం తిప్పి కొట్టాలన్నారు. మాలల హక్కులపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

వర్గీకరణ తర్వాతే ఉద్యోగాలివ్వండి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణమాదిగ



తలకొండపల్లిలో రిలే దీక్షలో కూర్చున్న నాయకులు

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ కోరారు. ఎస్సీ వర్గీకరణ అనంతరం ఉద్యోగాల ఫలితాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ సంఘీభావం ప్రకటించారు. దీక్షలో శ్రీను, సుధాకర్, సంజీవ, గోపాల్, వెంకటేశ్, పాండు, నవీన్, రజనీకాంత్, ఆంజనేయులు, సంతు, శ్యాంసుందర్, మధు, రవి, యాదగిరి, జగన్, సుల్తాన్, ఎల్లయ్యలు కూర్చున్నారు. కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. వర్గీకరణ లేకుండా ఉద్యోగాల భర్తీ జరిగితే మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చేవరకు ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు.

దృష్టి లోపం నిర్ధారణకు శిబిరాలు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీత



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డా.గీత

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులలో దృష్టి లోపాన్ని గుర్తించేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీత అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సుజల ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న వాళ్లను గుర్తించారు. ప్రభుత్వం నుంచి 350 మంది చిన్నారులకు కళ్లద్దాలు మంజూరయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఎక్కువగా టీవీ, మొబైల్ చూడటం వల్ల వారి దృష్టి బలహీనమవుతుందని అన్నారు. అందువల్లే చిన్న వయసులోనే చూపు లోపం ఏర్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.పూనమ్, రహీం, పద్మజ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

మంచాల: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన జీపీఏ సాధించాలని చేతాళ్ల సంజీవ మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు సతీశ్, సందీప్ సూచించారు. మంగళవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని జాపాల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి(ప్యాడ్, పెన్నులు) పంపిణీ చేశారు. అలాగే పాఠశాలలో విద్యార్థులు ఆడుకోవడానికి వాలీబాల్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బీమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశం

యాచారం: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నేతలు రవి, విప్లవ్‌కుమార్, శివలు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, తదితర సామగ్రిని అందజేశారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యాచారం: పరీక్ష సామగ్రి అందజేస్తున్న విద్యార్థి సంఘం నేతలు



మంచాలలో..

విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించండి



ఎమ్మెల్యే రంగారెడ్డితో గిరిజన సంఘం నాయకులు

మంచాల: మండలంలోని లోయపల్లిలో సేవాలాల్ మహరాజ్, మరియమ్మ విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మంగళవారం గ్రామానికి చెందిన గిరిజనులు కలిశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు కొర్ర శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. లోయపల్లిలో సర్వే చేసి గిరిజనులకు 5 గుంటల భూమి ఇవ్వాలని కోరారు. అందులో సేవాలాల్ మహరాజ్, మరియమ్మ విగ్రహాల ఏర్పాటుతో పాటు గుడి నిర్మాణం చేసుకుంటామన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ అనంత రెడ్డి, తహసీల్దార్ ఎం.వీ.ప్రసాద్‌కు వినతిపత్రాలు కూడా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, బాలునాయక్, గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాపై యువతకు అవగాహన



మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 25న కల్వకుర్తి పట్టణంలో నిర్వహించే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం మెగా జాబ్‌మేళాపై యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో 5 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని చెప్పారు. దాదాపు 50కి పైగా కంపెనీలతో మాట్లాడామని, ఆయా కంపెనీలలో అర్హులకు ఉద్యోగాలు కల్పిస్తాయని వివరించారు. జాబ్‌మేళాకు వచ్చే వారు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. కార్య క్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, రాజశేఖర్, కృష్ణ, శాంతిలాల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్

ఆమనగల్లు: విద్యార్థులు ఒత్తిడి, భయం లేకుండా పరీక్షలకు హాజరు కావాలని తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. చిన్నప్పటి నుంచే కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. మంగళవారం తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. సమావేశంలో శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడానికి కృషి చేయాలని కోరారు. మంచి చదువుతో ఉన్నతస్థాయికి ఎదిగి గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ చాంప్లానాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నసిమా సుల్తానా, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు ముజుబుర్ రెహమాన్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసమూర్తి, అంబాజీ, మార్కెట్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ అజీజ్, నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.